సాక్షి
నంద్యాల
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



లక్ష్మమ్మవ్వ సేవలో హైకోర్టు జడ్జి

ఆదోని అర్బన్: మహాయోగి లక్ష్మమ్మవ్వను గురువారం కర్ణాటక హైకోర్టు జడ్జి శివశంకర్ అమరన్నావర్ దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళా వేదికపై భక్తి గీతాలకు కళాకారులు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.16
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 98.424
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,258
అవుట్ ఫ్లో	: 10,159

న్యూస్‌రీల్

నేడు జ్వాలాతోరణోత్సవం

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైలంలో జ్వాలాతోరణోత్సవానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ముందుగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా విశేష పూజాదికాలు నిర్వహించి జ్వాలాతోరణం చుట్టు మూడు సార్లు స్వామిఅమ్మవార్ల పల్లకీని తిప్పుతారు. నేతితో తడిపిన నూలు వత్తులను ఏర్పాటు చేసి తిరిగి నెయ్యి పోసి వాటిని వెలిగిస్తారు. ఇది తోరణంగా వెలుగుతుంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పాతాళగంగ వద్ద ఉన్న కృష్ణవేణమ్మతల్లి విగ్రహానికి పుణ్యనదీహారతి నిర్వహిస్తారు. ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపాలను ఏర్పాటు చేసి లక్షదీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇదిలా ఉంటే దేవస్థాన ఇన్‌చార్జి ఈఓ. ఇ.చంద్రశేఖరరెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కార్తీక పౌర్ణమి ఏర్పాట్లను పరిశీలించారు.

మహానందిలో కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వర స్వామిని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది గురువారం రాత్రి పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చిన న్యాయమూర్తికి ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తర్వాత ఆయన శ్రీకామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

ఆర్‌యూ బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం (ఆర్‌యూ) పరిధిలో మే నెలలో నిర్వహించిన బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. విద్యార్థులు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 85 మందికి 79, సప్లిమెంటరీ విద్యార్థులు 16 మందికి 15 మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు.

108 ఉద్యోగుల సమ్మె సైరన్

గోస్పాడు: అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏసయ్య పేర్కొన్నారు. గురువారం వీరు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లకు నోటీసులు ఇచ్చారు.

సంక్రాంతి నాటికి పల్లె పండుగ పనులు పూర్తి

మహానంది: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 26 వేల సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్, ఐఎఫ్ఎస్ షణ్ముఖ కుమార్ తెలిపారు. మహానంది మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. రాష్ట్రస్థాయిలో 22,500 గోకులం షెడ్లు నిర్మిస్తున్నామన్నారు. మహానంది మండలంలోని గాజులపల్లె ఆర్ఎస్, అల్లినగరం, తదితర గ్రామాల్లో పల్లె పండుగ ద్వారా మంజూరై నిర్మిస్తున్న సీసీ రహదారులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జనార్ధన్‌రావు, జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఏపీడీ బాలాజీ నాయక్, ఏపీఓ మనోహర్ పాల్గొన్నారు.



ఇక్కడ రూ. 10 స్టాంపులపై రాసుకున్న అఫిడవిట్ చూపిస్తున్న విద్యార్థి పత్తి చరస్‌ప్రసాద్. ఆళ్లగడ్డ మండలం మర్రిపల్లె గ్రామానికి చెందిన ఈ విద్యార్థి పుట్టిన తేది 10వ తరగతి సర్టిఫికెట్‌లో, ఆధార్ కార్డులో వేర్వేరుగా ఉంది. సరిజేసుకునేందుకు రెవెన్యూ కార్యాలయం వెళ్లగా నోటరీతో అఫిడవిట్ రాయించుకుని రమ్మన్నారు. స్టాంపుల కోసం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తితే అక్కడి సిబ్బంది స్టాక్ లేదని బయట అమ్ముతుంటారు చూడు అని ఓ వ్యక్తి (వెండర్)ని చూపించారు. సదరు వ్యక్తి రూ. 10 స్టాంపు ఒక్కొక్కటి రూ. 300 అవుతుందని చెప్పడంతో విద్యార్థి తండ్రి కళ్లు బైర్లు కమ్మాయి. కొద్దిసేపటికి తేరుకొని రెండింటికి కలిపి రూ. 300 ఇస్తామని వేడుకున్నా కనికరించలేదు. శిరివెళ్లకు వెళ్లితే అక్కడ కూడా ఇదే పరిస్థితి. తప్పని స్థితిలో రూ. 350 చెల్లించి తెచ్చుకున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. జిల్లాలో ఎక్కడ చూసినా స్టాంపుల బ్లాక్ దందానే కొనసాగుతోంది.




కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

అక్రమాలకు స్టాంపు!

- జిల్లాలో స్టాంపు పేపర్ల బ్లాక్ దందా
- రిజిస్ట్రేషన్ అధికారులతో కుమ్మక్కైన వెండర్లు
- కొరత పేరుతో అధికంగా వసూళ్లు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- తెల్లకాగితాలపై రాయించుకుంటున్న క్రయవిక్రయ దారులు





తెల్ల కాగితాలపైనే క్రయ, విక్రయాలు

ఆధికారికంగా జిల్లాలో ప్రతి రోజు రూ. 13 లక్షల విలువైన స్టాంపులు అమ్ముడుపోతాయి. ప్రస్తుతం కార్యాలయ కౌంటర్లో స్టాంపులు లభించకపోవడంతో కొందరు వెండర్లు రూ. 10 స్టాంపు రూ.300 వరకు, రూ. 50 స్టాంపు రూ. 500 వరకు, 100 స్టాంపు రూ. 600 విక్రయిస్తున్నారు. దీంతో అంతమొత్తం చెల్లించి అవసరమైన మేరకు స్టాంపులు కొనుగోలు చేయలేని క్రయ, విక్రయ దారులు పై పేజీ వరకు స్టాంపు పేపరు కొనుగోలు చేసి మిగతా లోపలి పేజీలు అన్నీ తెల్లకాగితాలు తీసుకుని అందులో రాసుకుని రిజిస్టర్ చేయించుకుంటున్నారు.

ఆళ్లగడ్డ: జిల్లాలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయం అస్తవ్యస్తంగా మారింది. చట్టబద్ధమైన ప్రతి పనికి స్టాంపులు అవసరం. అయితే, సంబంధితశాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించకపోవడంతో కృత్రిమ కొరత సృష్టించి దండుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే స్టాక్ లేదని సమాధానం చెబుతున్నారు. ఫలితంగా స్టాంపుల వినియోగదారులతో పాటు ఆస్తుల క్రయ, విక్రయ దారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

స్టాంపువెండర్ల దందా

సాధారణంగా ఏదైనా భూమి కొనుగోలు ఒప్పంద పత్రాన్ని పొందాలన్నా, భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోవలన్నా, నోటరీ, ఇతర లావాదేవీలు జరపాలన్నా, ధ్రువీకరణ పత్రాలకు అఫిడవిట్ చేసుకోవలన్నా స్టాంప్ పేపర్లు తప్పనిసరి. అయితే వీటి కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోకి వెళ్లితే ఉద్యోగులు, సిబ్బంది తమ వద్ద స్టాకు లేవని సమాధానం చెబుతున్నారు. జిల్లాలోని 28 మండలాల పరిధిలో 13 రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 70 మంది దాక స్టాంపు వెండర్స్ ఉన్నారు. అయితే, అందరి దగ్గర స్టాంపుల కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితి గత అయిదు నెలలుగా నెలకొంది. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో లైసెన్స్ కలిగిన స్టాంపు వెండర్లు వీరికి కేటాయించిన చిరునామాలో బోర్డు పెట్టుకుని ప్రజలకు స్టాంపులు విక్రయించాలి. క్షేత్రస్థాయిలో ఇది ఏమాత్రం కనిపించదు. కార్యాలయానికి వచ్చిన స్టాంపులన్నిటినీ అధికారులతో కుమ్మక్కయ్యే కొందరు వెండర్లే కొనుగోలు చేసి బ్లాక్‌లో విక్రయిస్తున్నారు.

సర్టిఫికెట్లకు తప్పని పాట్లు

రెవెన్యూశాఖ జారీ చేసే జనన, మరణ, ఆదాయ, కుల, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, పుట్టిన తేదీ, నివాస స్థలం, పేర్లు తదితర వాటిలో సవరణ వంటి వాటికి న్యాయవాది ద్వారా నోటరీ అఫిడవిట్‌కు, పెళ్లిల్లు, సంస్థల రిజిస్ట్రేషన్‌కు నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అవసరం ఉంది. వీటికి రూ. 10, రూ. 20, రూ. 50, రూ. 100 విలువ చేసే దస్తావేజులు ప్రధానంగా కావాలి. వీటిలో ఏ పత్రాలు అందుబాటులో లేవు. ప్రొద్దుటూరు, బనగానపల్లె, శిరివెళ్ల, మైదుకూరు, దువ్వూరు, జమ్మలమడుగుకెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యకు స్టాంపు వెండర్లు, రైటర్లు, అధికారులు సిండికేట్‌గా సృష్టిస్తున్న కృత్రిమ కొరతే కారణమని తెలుస్తోంది.

కమీషన్ మినహాయించినా..

స్టాంపు వెండర్లు తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇండెంట్ పెట్టి స్టాంపు పేపర్లు కొనుగోలు చేస్తుంటారు. ప్రభుత్వం వీటి విలువ ఆధారంగా విక్రయాలపై అయిదు శాతం కమీషన్‌ను కొనుగోలు సమయంలో మినహాయింపు ఇచ్చి ఎంత విలువ చేసే స్టాంపును అదే ధరకు విక్రయించాలని చెబుతుంది. కానీ ఇది ఎక్కడా జరుగుతున్న దాఖలాలు లేవు. వినియోగదారుడి అవసరాన్ని ఆసరా చేసుకుని ఒకటికి 10 రెట్లు పెంచి దోచుకుంటున్న సంఘటనలే ఉన్నాయి. ఇదంతా అధికారుల ఎదురుగానే జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంత దారుణమా?



ఈ మధ్యకాలంలో ఎక్కడకు వెళ్లినా స్టాంపులు లేవు అంటున్నారు. వాళ్లు చెప్పిన కాడికి డబ్బులు ఇస్తే మాత్రం ఇస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆఫీస్‌లో కౌంటర్ ఏర్పాటు చేసి స్టాంపులు అమ్మాలి. లేకుంటే వెండర్ల దోపిడీని ఆపడం కష్టం. రూ. 10 అమ్మాల్సిన స్టాంపునకు రూ. 300 తీసుకుంటున్నారంటే ఇంతకంటే దారుణం ఉంటుందా?

– నాసారి వెంకటేశ్వర్లు, అహోబిలం

తెల్లకాగితాలపై రాయించుకున్నాం



మా బంధువులు పొలం కొనుగోలు చేశాం. రిజిస్టర్ చేయించుకునేందుకు ఆళ్లగడ్డ రిజిస్ట్రార్ ఆఫీస్ దగ్గరకు వెళ్లాం దస్తావేజులు రాసేందుకు రూ. 50 స్టాంపులు 10 కావాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అడిగితే అందుబాటులో లేవు బయట స్టాంపు వెండర్ల దగ్గర తీసుకోమని చెప్పారు. అక్కడ రూ. 50 స్టాంప్ రూ. 500 అన్నారు. 10 స్టాంపులకు రూ. 5000 అవుతుందని 2 స్టాంపులు తీసుకొని లోపలి పేజీలు తెల్ల కాగితాల్లో రాసుకుని రిజిస్టర్ చేయించుకున్నాం.

– బత్తుల క్రిష్ణయ్య యాదవ్

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం



స్టాంపు వెండర్లు అధిక ధరకు విక్రయించ కూడదు. స్టాంపుపై ఎంత ఉంటే అంతకే విక్రయించాలి.వెండర్లకు ఆ స్టాంపులకు సంబంధించిన కమీషన్ ముందే ఇవ్వడం జరుగుతుంది. అధికంగా వసూలు చేస్తున్నారని ఎవరైనా వచ్చి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తాం. కృత్రిమ కొరతపై విచారించి చర్యలు తీసుకుంటాం.

– చైతన్య రాయలు, సబ్ రిజిస్ట్రార్, ఆళ్లగడ్డ

సహకార సంఘాలను బలోపేతం చేద్దాం

- సహకార వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: సహకార సంఘాల్లో లోటుపాట్లను అధిగమించి వాటిని బలోపేతం చేద్దామని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని జేవీఆర్ నగర్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆవరణలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ పరిపుష్టికి అన్ని సంఘాల పాలకవర్గ సభ్యులు, అధికారులు, బ్యాంకు సిబ్బంది తమ వంతు కృషి చేయాలన్నారు. సహకార చట్టాలకు, బైలాలకు సంఘ సభ్యులు లోబడి పని చేయాలన్నారు. ఏ ఒక్కరూ సహకార సంస్థల నిర్వీర్యానికి అవకాశం ఇవ్వరాదన్నారు. తప్పు చేసిన వ్యక్తులకు దండన ఇవ్వడంలో జాప్యం చేయరాదని అధికారులను ఆదేశించారు. అంతకుముందు సహకార గీతాలాపనలో పాల్గొన్న విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, జేవీఆర్ నగర్ సీహెచ్‌బీఎస్ సంఘ అధ్యక్షుడు నారాయణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, కోయిలకుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాసరావు, రాష్ట్ర సహకార యూనియన్ ప్రతినిధి ఎస్. నర్సింహారెడ్డి, సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

'క్యాన్సర్ స్క్రీనింగ్' సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వైద్య సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణతో కలిసి కలెక్టర్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ అధికారి డాక్టర్ కాంతరావునాయక్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి

పాణ్యం: జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పాణ్యం మండలం అనపూరు గ్రామంలో మిబిల్స్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద చిరుధాన్యాలకు మార్కెటింగ్ కల్పించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మరోసారి ప్రజలకు దగా

- సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్‌లో పైసా కేటాయింపులు లేవు
- ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం
- హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తను తరలిస్తే ప్రజా ఉద్యమం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య తదితరులు

కర్నూలు (టౌన్): ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలకు నిధులు కేటాయించకుండా చంద్రబాబు ప్రజలను మరోసారి దగా చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీ అని మండిపడ్డారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు , రూ. 12 లక్షల కోట్లు అప్పు చేసిందని, రాష్ట్రం శ్రీలంక అవుతుందని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు వారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 6 లక్షల కోట్లే అని ప్రకటించడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు 2 డీఏ లు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ప్రయోజనం కూడా చేకూర్చలేదన్నారు. డీఏలు లేవు, ఐఆర్‌లు లేవు అన్నారు. పీఆర్‌సీ గురించి పట్టించుకునే పరిస్థితే లేదన్నారు. పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా కూటమి ప్రభుత్వం ఏ పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పిందన్నారు. ఇందుకు రూ. 37, 318 కోట్లు బడ్జెట్ అవుతుందన్నారు. అయితే, పైసా కూడా కేటాయించలేదన్నారు. నిరుద్యోగ భృతి కూడా అంతే అన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చమని అడిగితే కూటమి సర్కారు కేసులు పెట్టి భయపెట్టడం సిగ్గుచేటన్నారు. జమిలీ ఎన్నికలు త్వరలోనే వస్తున్నాయని, ప్రజలు బాబుకు గుణపాఠం చెబుతారన్నారు.

కోర్టును ఆశ్రయిస్తాం

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం కర్నూలులో హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, నేషనల్ లా యూనివర్సిటీ ఇలా ఎన్నో సంస్థలు తీసుకువస్తే వాటిని తరలించేందుకు కూటమి సర్కారు కుట్ర చేస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. నిలవరించేందుకు కోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాజకీయ పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో వైస్సార్‌సీపీ నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కన్నీటి దిగుబడి!

- రైతులకు కలిసి రాని మొక్కజొన్న సాగు
- మొదట్లో వర్షాభావం.. పైరు చేతికందే దశలో తుపాన్ ప్రభావం
- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- దక్కని గిట్టుబాటు ధర
- ఆందోళనలో కర్షకులు





కోవెలకుంట్ల సమీపంలో ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

కోవెలకుంట్ల: మొక్క జొన్న రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసి రాలేదు. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట చివరికి నష్టాలు మిగిల్చింది. గత ఏడాది వాతావరణం అనుకూలించి మొక్కజొన్న సాగు అన్ని విధాలా కలిసి వచ్చింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెట్టింపు ఉత్సాహంతో పంట సాగు చేశారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది 1.13 లక్షల ఎకరాల్లో సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల్లో 1.35 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. జిల్లాలోని కొత్తపల్లె మండలంలో అత్యధికంగా 16, 255 ఎకరాల్లో, పాములపాడు మండలంలో 16,253 ఎకరాల్లో, జూపాడుబంగ్లా మండలంలో 11,765 ఎకరాల్లో, ఆత్మకూరు మండలంలో 10,796 ఎకరాల్లో, నందికొట్కూరు మండలంలో 10,126 ఎకరాల్లో, మి డుతూరు మండలంలో 9,988 ఎకరాల్లో, బనగానపల్లె మండలంలో 7, 349 ఎకరాల విస్తీర్ణంలో వేసినట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. 105 నుంచి 110 రోజులు పంట కాలంకాగా పైరు ఆరంభంలో వర్షాభావం, పంట చేతికందే తరుణంలో తుఫాన్ వెంటాడి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపడటంతో దిగుబడులు అంతంత మాత్రంగానే రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేలకు పైగా వెచ్చించారు. ప్రస్తుతం ఎకరాకు 22 నుంచి 30 క్వింటాళ్లలోపే దిగుబడులు వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు.

గతేడాది 35 క్వింటాళ్ల దిగుబడులు

గతేడాది జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో రైతులు 1.13 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. మొదట్లో వర్షాభావం, పంట చేతికందే తరుణంలో అధిక వర్షాలు ప్రభావం చూపాయి. అన్నింటినీ అధిగమించి ఎకరాకు 32 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులొచ్చాయి. వర్షాలకు తోడు రైతులు చేపట్టిన పంటమార్పిడి విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు చేతికందాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 2,500 ధర పలకడంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే దిగుబడులను విక్రయిస్తుండటంతో రైతులకు దళారుల బెడద తప్పింది. ఈ ఏడాది అదును విస్తారంగా వర్షాలు కురియడంతో సాగుకు అన్ని విధాలా కలిసొస్తుందని భావించి సాధారణ విస్తీర్ణం మించి సాగు చేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది.

22 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి



ఎకరా రూ. 32 వేలు కౌలు చెల్లించి రెండున్నర ఎకరాల్లో ఈ ఏడాది మొక్కజొన్న పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25వేలు వెచ్చించాను. పైరు చేతికందే తరుణంలో భారీ వర్షాలు కురవడంతో ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వచ్చాయి. ఈ ధరకు విక్రయిస్తే కౌలు, పెట్టుబడులకే సరిపోతుంది.

– హాజీవలి, రైతు, అకుమల్ల, సంజామల మండలం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మొక్కజొన్న దిగుబడులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.ఈ ఏడాది నాకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న దిగుబడులు విక్రయించింది. క్వింటాకు రూ. 3 వేలు గిట్టుబాటు ధర కల్పించి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

పెట్టుబడులు పెరిగి.. దిగుబడులు తగ్గి

పైరు కంకిదశలో ఉండగా గత నెలలో తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో పంట దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేలకు పైగా వెచ్చించినా ఎకరాకు 22 నుంచి 30 క్వింటాళ్లలోపే దిగుబడులు రావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మార్కెట్‌లో క్వింటా రూ. 2,200 ధర పలుకుతుండటంతో ఈ ధరకు విక్రయిస్తే నష్టాలు తప్పవని రైతులు పేర్కొంటున్నారు. క్వింటాకు రూ. 3 వేలు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్థానిక సంస్థలకు రూ.60 కోట్లు విడుదల

కర్నూలు (అర్బన్): జిల్లాలోని స్థానిక సంస్థలకు (2024–25 ఆర్థిక సంవత్సరానికి) 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు రూ.60.08 కోట్లు గురువారం విడుదలయ్యాయి. కేటాయింపుల మేరకు జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,33,72,556, టైడ్ గ్రాంట్ కింద మరో రూ.8,00,59,140 విడుదలైనట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 53 మండలాలకు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,42,88,238, టైడ్ గ్రాంట్ కింద రూ.8,14,32,379 మేర నిధులు విడుదలయ్యాయని తెలిపారు. మండలాలకు సంబంధించి అత్యధికంగా ఆదోని మండలానికి రూ.47.99 లక్షలు, ఆ తర్వాత బనగానపల్లె మండలానికి రూ.47.18 లక్షలు విడుదలయ్యాయని జెడ్పీ సీఈఓ వెల్లడించారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.13,24,97,103, టైడ్ గ్రాంట్ కింద రూ.19,87,45,647 మేర నిధులు విడుదలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఆయా గ్రామ పంచాయతీలకు ఈ నిధులు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: అనంతపురం జిల్లా ముజ్జగుబ్బ గ్రామానికి చెందిన చింతల అంజనేయపై ఆదోని త్రీటౌన్ పోలీసులు, మహమ్మద్ ఇస్మాయిల్‌పై వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఐటీడీపీ నాయకురాలు అంజనమ్మ, వాల్మీకి నగర్‌కు చెందిన బోయ వెంకటేష్ ఫిర్యాదు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రాలపై అసభ్యకరంగా, వ్యగ్యంగా చిత్రాలు పోస్టు చేసినందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), విద్వేషాలకు గురి చేయడం చట్టం కింద వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే మహమ్మద్ ఇస్మాయిల్ ఏ ప్రాంతానికి చెందిన వారో తెలియాల్సి ఉందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుతో మహిళకు అస్వస్థత

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై కురువ అనసూయ (28) అస్వస్థతకు గురైంది. అనసూయ తన మిరప పొలంలో పని చేస్తుండగా మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభం కావడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లింది. కాసేపటికే కొద్ది దూరంలో పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. చుట్టు పక్క రైతులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించి ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు: కర్నూలు–కడప జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని శకునాల గ్రామానికి చెందిన బాలగంగాధర్‌రెడ్డి అలియాస్ బాలు(45) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కేబుల్ కనెక్షన్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే బాలు వ్యక్తి గత పనిమీద హుసేనాపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బైక్‌ను ఒకచోట పెట్టి రోడ్డును దాటుతుండగా కర్నూలు నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ బాలును ఢీకొని కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య విజయలక్ష్మితోపాటు, నవీన్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. మృతుని కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



పురుగు మందుల పరిశీలిస్తున్న డీఏఓ

నంద్యాల(అర్బన్): మండలంలోని ఎరువుల దుకాణాలను గురువారం డీఏఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. శ్రీనంది ఏజెన్సీస్, గోళ్ల వెంకట నారాయణశెట్టి పురుగు మందుల దుకాణాల్లో పత్రాలు, రిజిస్టర్లు, బిల్‌బుక్స్, నిల్వలను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ పురుగు మందుల దుకాణదారులు రోజువారి స్టాక్ బోర్డును అప్‌డేట్ చేయాలని, స్టాక్ బుక్ నిల్వలు, గ్రౌండ్ నిల్వలు ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనుమతులు ఉన్న పురుగు మందులను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఏటా పురుగు మందుల లైసెన్స్‌లు, లావాదేవీల వివరాలు సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి ప్రసాదరావు ఉన్నారు.

పిల్లలూ.. ఇష్టపడి చదవండి

- అనాథ, భిక్షాటన, బుడగజంగాల పిల్లల మధ్య బాలల దినోత్సవం
- స్టార్ సొసైటీ, సాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, పాటల పోటీలు
- విజేతలకు బహుమతుల పంపిణీ





బొమ్మలు వేస్తున్న చిన్నారులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత రంగాల్లో రాణించవచ్చని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు ఏ.రాజేశ్వరమ్మ సూచించారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్టార్ సొసైటీ, సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో నందమూరి నగర్‌లోని అనాథ భిక్షాటన, బుడగజంగాల పిల్లలు ఉన్న నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అవాసయ్య విద్యాలయంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేయడంతోపాటు ఆటల పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్, పాటలు, స్పీచ్ తదితరు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువే మంచి ఆస్తి అని, ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో రాణించాలన్నారు. స్టార్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ వీధి బాలలు, అనాథ పిల్లలు, బుడగజంగాల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు తలుచుకుంటూ విద్యార్థులను భావి తర పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. సాక్షి స్టాఫ్ రిపోర్టర్ పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ వీధి బాలలు, భిక్షాటన, బుడగజంగాల పిల్లలకు ఇప్పటికీ ఆధార్ కార్డులు లేవంటే నమశక్యంగా లేదన్నారు. పాఠశాల యాజమాన్యం అందరికీ ఆధార్ కార్డు ఇప్పించేలా కృషి చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వీధి పిల్లలు, భిక్షాటన పిల్లల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విద్యాలయం హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

డ్రాయింగ్ బాలుర విభాగంలో మహేష్, విజయరాజు, బాలికల విభాగంలో జమున, కావేరిలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, పాటల విభాగంలో రాగలక్ష్మి, మనిశ్రీ, స్పీచ్‌లో జమున, మనిశ్రీలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్టార్ సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు ఏ.రాజేశ్వరమ్మ, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ పి.హరినాథరెడ్డి



కార్యక్రమానికి హాజరైన బాలబాలికలు

మీ కుమార్తెను అరెస్టు చేశామంటూ తండ్రికి ఫోన్

జూపాడుబంగ్లా: 'మీ అమ్మాయిని అరెస్టు చేశాం.. మావద్దనే ఉంది. మీరు వెంటనే రావాలి' అంటూ మండల కేంద్రానికి చెందిన హబీబ్ అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేయడంతో అతడు ఆందోళన చెందాడు. పాఠశాల వద్దకు చేరుకుని తన కూతురిని కలుసుకుని ఊపిరి పీల్చుకున్నాడు. అనంతరం అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హబీబ్ కూతురు స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. కూతురు ఉదయం స్కూల్‌కి వెళ్లిన తర్వాత హబీబ్ సెల్‌ఫోన్‌కు +447457413061, +923177399100 నెంబర్ల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్ చేశారు. మీ కూతురిని ఓ మర్డర్ కేసు, రేప్ కేసులో అరెస్టు చేశామని చెప్పడంతో హబీబ్ దంపతులు భయాందోళనతో మోడల్ పాఠశాల వద్దకు పరుగులు తీశారు. అక్కడ కూతురిని చూసి ఊపిరి పీల్చుకున్నారు. ఈక్రమంలోనే మరోసారి ఫోన్ రావడంతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. కంప్యూటర్ నుంచి వచ్చిన కాల్స్ అని, ఇలాంటి వాటిని లిఫ్ట్ చేయవద్దని ఎస్‌ఐ సూచించారు.

మద్యం దుకాణాల్లో చోరీ

- రూ.3.50 లక్షలకు పైగా నగదు అపహరణ



వైన్‌షాప్‌లోని సీసీ కెమెరాను పరిశీలిస్తున్న టౌన్ సీఐ వి.శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని మూడు మద్యం దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎద్దుల మార్కెట్ వద్ద ఉన్న ఆదిలక్ష్మి వైన్ షాప్ రేకుల షెడ్ పైకప్పును కట్ చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు రూ. 2 లక్షలకు పైగా నగదు అపహరించుకెళ్లారు. విశాల్ మార్ట్ సమీపంలోని వివి వైన్ షాప్‌లోనూ అదే మాదిరిగా లోపలికి చొరబడి చోరీకి ప్రయత్నింగా నగదు లేకపోవటంతో వెనుతిరిగినట్లు తెలుస్తోంది. ఆదోని బైపాస్ రోడ్డులోని హేమంత్ వైన్ షాప్ షట్టర్ తీసి అందులో రూ.1.50 లక్షలు నగదను చోరీ చేసినట్లు సమాచారం. గురువారం యజమానులు మద్యం దుకాణాలకు చేరుకోగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ వి.శ్రీనివాసులు, ఎస్‌ఐ డాక్టర్ నాయక్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించారు. దుకాణాల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

హైజినిక్ కార్నర్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): డెటాల్ డెనవా, స్వచ్ఛతా ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హైజినిక్ కార్నర్ సెంటర్‌ను గురువారం డీఈఓ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికి ఇది సర్కారు హత్యే



మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



వీఓఏ మృతికి కారకులైన వారిపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: పొదుపు మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి విశేష కృషిచేసిన వెంకట్రామిరెడ్డిది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం చేసిన హత్యేనని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఆరోపించారు. వెలుగు ప్రాజెక్టులో విలేజ్ ఆర్గనైజ్ అసిస్టెంట్(వీఓఏ)గా పనిచేస్తున్న డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి వెంకట్రామిరెడ్డిని కూటమి నాయకులు, అధికారులు వేధించడంతో ఆయన గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరునాంపల్లె తిరుమలరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపూజెర్ల రామచంద్రారెడ్డి, పెద్దపూజెర్ల కమతం భాస్కర్‌రెడ్డి, దొరపల్లె చిరంజీవి, కొచ్చెర్వు మధురెడ్డి, పార్టీ డోన్ పట్టణ అధ్యక్షులు కురుకుందు హరి తదితరులు వెంకట్రామిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌షాప్ డీలర్లను, బుక్ కీపర్లను అక్రమంగా తొలగించేందుకు పోలీసులను సైతం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

రాజకీయాలతో సంబంధం లేని బుక్ కీపర్లను తప్పుడు మార్గాల ద్వారా తొలగిస్తూ వారిని వేధింపులకు గిరిచేసి ప్రాణాలు తీసుకునేలా వ్యవహరిస్తున్న వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు శివరాం, వీఓఏల సంఘం నాయకులు యాపదిన్నె గూండాలు డిమాండ్ చేశారు. గురువారం వారు వెంకట్రామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు కొత్తబురుజుకు బుగ్గన

వెలుగు వీఓఏ వెంకట్రామిరెడ్డి మృతిపై ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న విషయాలకు కూడా అధికార కూటమి నాయకులు బూతద్దంలో చూపిస్తూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం జరిగే వెంకట్రామిరెడ్డి అంత్యక్రియల్లో తాను పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు.

అవినీతికి కేరాఫ్ వీరభద్ర గౌడ్

- ఇసుక దందా, బెల్టు షాపుల ఏర్పాటుకు రూ.లక్షల్లో వసూళ్లు
- పోలీసుల అండతో పేకాట స్థావరాల ఏర్పాటు
- దోచుకోవడమే పనిగా పెట్టుకున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్
- వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ అవినీతికి కేరాఫ్‌గా మారి, పనికో రేటు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని వైఎస్సార్ సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అసెంబ్లీకి వెళ్లకపోవడం దురదృష్టకరమని బుధవారం విలేకరుల సమావేశంలో విమర్శించడంతో గురువారం విరూపాక్షి స్పందించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019లో ఇన్‌చార్జ్‌గా ఉన్న వీరభద్ర గౌడ్ చేసిన అవినీతిని ఎండగట్టారు. దోచుకోవడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. ప్రస్తుతం మరోసారి ప్రజలు ఓడించినా బుద్ధి రాలేదన్నారు. కూటమి అధికారాన్ని అడ్డుపెట్టుని నియోజకవర్గంలో పనికో రేటు పెట్టి రూ.కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా పోలీసులను అడ్డుపెట్టుకుని పేకాట నిర్వహిస్తున్నారన్నారు. అక్రమ రేషన్ రావాణా, డీలర్ షిప్ మార్పులు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు, వంట ఏజెన్సీల మార్పు కోసం రూ.లక్షలు దోచుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానన్నారు. ఇప్పటికే ఆలూరు అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రి రామా నాయుడుకు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రశ్నిస్తారని తమ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, అందుకనే తాము అసెంబ్లీకి వెళ్లడం లేదని వివరించారు. ఇకనైనా తనపై వ్యక్తి గత విమర్శలు మానుకుని ఆలూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని వీరభద్ర గౌడ్‌కు ఎమ్మెల్యే విరూపాక్షి హితవు పలికారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, మండల కో–కన్వీనర్ వీరేష్ తదితరులు ఉన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): అసంక్రమిత వ్యాధులు(బీపీ, షుగర్, క్యాన్సర్) పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. గురువారం నగర శివారులోని ఇ.తాండ్రపాడు గ్రామంలో ఎన్‌సీడీ 3.0 యూనివర్సల్ కామన్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పంచలింగాల గ్రామంలోని ఆరోగ్య క్లినిక్‌ను సందర్శించి అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం ద్వారా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైపర్‌టెన్షన్(బీపీ), డయాబెటీస్, సాధారణ క్యాన్సర్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, స్క్రీనింగ్‌లో నాణ్యత పాటించడం, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల డేటా సేకరణ చేయడం, సర్వేను గోప్యతతో నిర్వహించడం, 18 ఏళ్లు పైబడిన మహిళలు, గర్భిణులకు స్క్రీనింగ్‌లో గోప్యత కచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకోసం ఇచ్చిన శిక్షణ సామగ్రి, కరపత్రాలు, రేడియో ప్రకటనలను ఉపయోగించాలన్నారు. మొబైల్ డేటాను సరైన సమయంలో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన ఆరోగ్యసేవల కోసం సమీప ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే పీఓ హేమలత, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజూషా, జిల్లా ఎపడమాలజిస్టు జి. వేణుగోపాల్ పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దు

- జిల్లా ఎస్పీ బిందు మాధవ్
- బెంగళూరుకు చెందిన నలుగురు వ్యక్తుల అరెస్టు



మోసం చేసేందుకు ప్రయత్నించిన కర్ణాటక వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

కర్నూలు (టౌన్): ప్రజలు అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. సెంట్రల్ ఫండ్ నుంచి రూ.20 కోట్ల నిధులు అప్పుగా ట్రాన్స్‌ఫర్ చేయిస్తామని మోసం చేసిన బెంగళూరుకు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక మహీంద్రా రెడ్ కలర్ కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా 12 గంటల వ్యవధిలోపే నిందితులను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. డబ్బులు వస్తాయని అతిగా నమ్మి మోసపోవడమే ఇందుకు కారణమని, ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కాగా కేసు వివరాలను టూటౌన్ సీఐ నాగరాజరావు, ఎస్‌ఐ మోహన్‌కిషోర్ వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిద్ధవరం గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే వ్యక్తికి బెంగళూరుకు చెందిన హరీష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు తాను విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి కంపెనీలతో పరిచయాలు ఉన్నాయని నమ్మించాడు. రూ.20 కోట్ల నిధులు అప్పుగా ఇప్పిస్తామని జీఎస్టీ రూపంలో రూ.15 లక్షలు చెల్లిస్తే చాలని వారికి సూచించారు. అతని మాటలు నమ్మి సోమశేఖర్‌తో పాటు అతని మిత్రుడు బసవరాజు కలిసి కర్నూలులోని రాజ్‌విహార్ సెంటర్ లాడ్జిలో మంతనాలు చేశారు. అయితే వారి మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో రెండవ పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన కర్ణాటకకు చెందిన హరీష్, భానుప్రతాప్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

కొండమాయపల్లె చెరువుకు గండి


- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



నీటి మునకకు గురైన వరి

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె చెరువుకు తూము పక్కనే గండి పడింది. కొద్ది రోజులుగా గండి పడి చెరువులోని నీరంతా వృథాగా దిగువన ఉన్న ఆయకట్టు పొలాల్లోకి వెళ్తుండటంతో పైర్లు దెబ్బ తింటున్నాయి. ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆర్.కొత్తూరు, రాంనగర్ గ్రామాలకు చెందిన రైతులు చందాలుగా వేసుకొని గురువారం గండిని పూడ్చుకున్నారు. 60 మట్టి సంచులను అడుగు భాగాన పేర్చి వాటిపై మట్టి పోసి చదును చేశారు. పైర్లను కాపాడుకునేందుకు తామే గండిని పూడ్చుకోవాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. ఈ విషయంపై మైనర్ ఇరిగేష్ ఏఈ రఘురాంను వివరణ కోరగా గండి పడినట్లు ఇప్పుడే తెలిసిందని, వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ మంజునాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్

కోసిగి: మండల పరిధిలోని కడదొడ్డి గ్రామంలో 14 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నం కేసుకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ మంజునాథ్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ చంద్రమోహన్‌తో కలిసి ఆయన నిందితుల వివరాలు వెల్లడించారు. గత నెల 30న ఇంటి ఆవరణంలో నిద్రిస్తున్న బాలికపై అదే గ్రామానికి చెందిన బోయ ఉసేని అత్యాచారానికి యత్నించగా అతని స్నేహితులు బోయ వినోద్, బోయ మజ్జిగ సూర్యనారాయణలు కాపలాగా ఉన్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను గురువారం ఉరుకుంద క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా నిందితులలో బోయ వినోద్‌పై ఇప్పటికే 8 కేసులు, సూర్యనారాయణపై ఒక కేసు నమోదై ఉండటంతో వీరిపై రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు.

పనిచేసినా పస్తులే!

- పూడూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం మధ్య నలుగుతున్న ఇద్దరు ఉపాధ్యాయులు
- రెండు నెలలుగా జీతాలు చేయని హెచ్‌ఎం..
- తనకు ఈ టీచర్లు వద్దంటూ డీఈఓకు సరెండర్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్‌గా స్కూల్‌కు హాజరై పని చేస్తున్నా వేతనాలు చేయాల్సిన ప్రధానోపాధ్యాయుడు సతాయిస్తున్నాడని బాధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తుండగా.. తనకు గౌరవం ఇవ్వకపోవడంతోపాటు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తూ ఏమాత్రం సహకరించడం లేదనేది హెచ్‌ఎం వాదన. మండలంలోని పూడూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం శేషఫణి రాజు, తెలుగు టీచర్ జి.నాగేంద్రుడు, బయోలాజికల్ సైన్స్ టీచర్ డి.బాకర్ సాహెబ్‌తో కలిపి మొత్తం 8 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిందరికీ హెచ్‌ఎం నెలనెలా వేతనాలు చేయాల్సి ఉంది. అయితే కొంతకాలంగా హెచ్‌ఎం శేషఫణిరాజుకు ఉపాధ్యాయులు నాగేంద్రుడు, బాకర్‌సాహెబ్‌కు సరిపోవడం లేదు. దీంతో హెచ్‌ఎం ఆగస్టు నెల జీతం చేయకపోవడంతో టీచర్లు డీఈఓ దృష్టికి తీసుకెళ్లి కాస్త ఆలస్యంగా జీతాలు చేయించుకున్నారు. సెప్టెంబరు, అక్టోబరు జీతాలు కూడా చేయకపోవడంతో ఆగస్టు నెలలో జి.నాగేంద్రుడు. హిందీ టీచర్ సురేంద్ర ఇంక్రిమెంట్స్ నిలిపి వేశారు. సమస్యను పరిష్కరించాల్సిన అప్పటి డీఈఓ తాత్సారం చేయడంతో బాధిత టీచర్ల రెండు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒకానొక సందర్భంలో ఆదోని డిప్యూటీ ఈఓ, ఓ ఎంఈఓలను విచారణ అధికారులుగా నియమించారు. కానీ విచారణ మాత్రం జరగలేదు. ఇటీవల జీతాలు చేయాలని అధికారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో గురువారం ఏకంగా టీచర్లను డీఈఓకు హెచ్‌ఎం సరెండర్ చేశారు.